"నా మాట అబద్ధమేమో చూడు. నిన్ను మెల్లిగా పంజాతో ఒక దెబ్బ కొడతాను. ఆ తర్వాత పూర్తి దెబ్బ తట్టుకోగల వేమో చూడు అని అర సెకందు ఆగకుండా గంగిగోవు తలమీద పాపు బలంతో ఒక దెబ్బ కొట్టింది" పులి.

ఆవుకి యినపరాయితో తలమీద ఎవరో రాక్షసుడు కొట్టి నట్టు అయింది. తల పగిలిపోయినట్టు రక్తం చిమ్మింది. కళ్ళలో రక్తంపడి ఎదురుగా ఉన్న పులి రక్తంలో స్నానం చేసిన దానిలా భయంకరంగా కనిపించింది.

నువ్వు నల్లదానివి, అంటే మంచిదానివీ, తెలివైన దానివీ అన్నమాట. నేను నిన్ను అరక్షణంలో చంపగలననీ ఈ పాటికి గ్రహించే ఉంటావు. ఇంత మంచిదానివి నిన్ను ఎక్కువ బాధపెట్టి చంపదలచుకోలేదు. నువ్వు పెనుగులాడకుండా ఉంటే మూణ్ణి మషాల్లో పని పూర్తి చేస్తాను అంది పులి పనిలోకి దిగడానికి సిద్ధపడుతూ.

ఆవు పవిత్రమైన ఆశ్రమ వాతావరణంలో పెరిగింది. చావు అంటే ఈ ఐహిక బంధాల నుండి ఆత్మవిముక్తి పొందడం అని ఏనాడో గ్రహించినదవడం వల్ల, పులి అన్నమాటకు జడవలేదు. కాని దాని మనసు ఒక్కసారి ముడిపడినట్టు బాధపడింది. తన పిల్లని తల్చుకోగానే.

అంచేత "ఓ పులి పుంగవా? నేను గోవుని. అంటే జీవ రాసుల్లో పవిత్రమైనదాన్ని. నీ ఆకలి తీర్చే అవకాశం ఇచ్చిన నీకు ఎలా ధన్యవాదాలు చెప్పుకోవాలో తెలియడం లేదు. నువ్వు కొట్టిన చావుదెబ్బతో బతకడం చావుకన్న దుర్భరంగా ఉంది. కాని ఒక్క మనవి. ఇప్పుడు నీ అంత ఆకలితోనూ నా బిడ్డ ఆశ్రమంలో కిరకిరలాడుతూ ఉంటుంది. కాబట్టి నాకు వ్యవధి యిస్తే దాని ఆకలి తీర్చి క్షణంలో వచ్చేస్తా. అప్పుడు నువ్వు కొమ్ముల్తో సహా తినెయ్యి అంది.

పులి ఆలోచిస్తూ కళ్ళు మూసుకుంది.

"నీకు దూడవుందని నేను నమ్మను" అంది కళ్ళు తెరవ కుండా.

"నా ఈ చేసిన పొదుగు చూడు" తనన్న మాట నిజమన్న నమ్మకంతో అంది గంగిగోవు.

"చేట పెయ్యలకి చేసే జాతి నీది" అంది ఎగతాళిగా పులి.

ఆవు అంతరాత్మ. ఆత్మాభిమానం దెబ్బతిన్నాయి. నా దూడని నాతోకూడా తెస్తే అది బతికే ఉందని నమ్ముతావా? అంది ఆవు రోసంగా నోట్లోకి కారిని రక్తాన్ని కక్కుతూ.

అలా అయితే నమ్ముతా, కాని వేగం వచ్చేయ్ అనుమతిం చింది పులి.

❖ ❖ ❖

తర్వాత హంశాలు చకచకా జరిగిపోయేయి.

బాధతోనూ, ఆత్రుతతోనూ గంగిగోవు ఆశ్రమానికి పరి గెత్తింది. తన దూడకి ఆఖరిసారి తనివితీరా పాలు ఇచ్చుకుంది. పాలిస్తున్నప్పుడు దాని రక్తం దూడమీద కూడా పడింది.

ఆ తర్వాత గంగిగోవు పిల్లతో సహా హాజరైంది పులి దగ్గరకి.

"నీ నిజాయితీకి నేను మెచ్చేను" అని పులి దాన్ని అభినం దించింది.

తర్వాత – ముందు దూడనీ, తర్వాత ఆవునీ తినేసింది.

**(1971)**

# తొడిమిలేని పువ్వు

**సం**తుష్టిగా భోంచేసిన తృప్తితో వళ్ళు బద్ధకం విరుచు కొని ట్రావెలర్స్ బంగళా వరండాలో ఈజీ చైర్లోవాలి ఆనందరావు సిగరెట్టు వెలిగించేడు. ఐదడుగుల పదంగుళాల పొడవూ, అంతకు సరిపడిన దానికంటే కాస్త ఎక్కువ ఒడ్డూగల అతను చిన్న చూపంటూ ఎరగడు. అతను చేసే ఏపనైనా పెద్దపెట్టున వుంటుంది. అతని ప్రతిప్లానూ అతి భారీగా వుంటుంది. అతను ఎమ్మేల్యే అయి వుంటే ఏనాడో మినిష్టరై ఉండేవాడు. అతను ప్రైమినిష్టరైతే యేనాడో దేశాన్ని అమెరికాకి అమ్మేసి వుండేవాడు. అతనికి ముందు చూపు ఎక్కువ. తన అంచనాలలో అతను ఎప్పుడూ దెబ్బతినలేదు. జీవితంలో తన ఆట గెలవటానికి ఏపనైనా సంతో షంగా చేసేసే శక్తి అతనికుంది. అతను తెలిసుండీ– కావాలనే – కురూపిని పెళ్ళాడేడు. పెళ్ళినాటి ప్లాను పనిచేసి అతనిప్పుడు డి.యస్పీ.ఐ కూర్చున్నాడు. బాహాటంగా "నా" అని చెప్పు కోడా నికి ఒక కారూ, ఒక భార్యా, ఆల్సేషియన్ కుక్కలాంటి పొలి టీషియన్ మామా, హైదరాబాదులో ఒక యిల్లు, ఏభైవేల యిన్సూ రెన్సు పోలసీ, జీవితంలో ముందుకు పోతామన్న విశ్వాసం అతని కున్నాయి.

ప్రపంచంలో "న్యాయం అన్యాయం" అన్నవి రెండు లేవనీ, తనకి ఉపయోగపడే ప్రతీ విషయం న్యాయమైనదేననీ తనకి నష్టం కలిగించే ప్రతి విషయం అన్యాయమేనన్న నమ్మకాలవల్ల ఏర్పడ్డ సంతృప్తి అతని కళ్ళల్లో నిత్యం మెరుస్తూ వుంటుంది.

"యూనీఫారం ఏసుకొని, నల్లద్దాలెట్టుకొని కారు సెక్కరం కాద కూకుంటే అచ్చం మిలిట్రీ మేజర్లా గుంటాడు, మా అయ్య" అని అతని ఆర్డర్లీ అన్నట్టు అతనుంటాడు. అతని పక్కనుండే రత్నమాణిక్యాంబ శిల్కుచీర విప్పేసి చింకి చీర కట్టుకొని, మస్లిన్ జాకెట్టువిప్పి మాసిన జాకెట్టు తొడుక్కుంటే, "పనైపోనాది, నానింటికెళ్ళిపోతున్నా" నని చెప్పడాని కొచ్చిన పనిమనిషిలా వుంటుంది. అంచేత తనైనా ఎప్పుడైనా ఫర్–ఎ–ఛేంజి ఖాదీ స్లేక్ తొడుక్కోవచ్చు (అదైనా టెరిలిన్ ప్యేంట్. హెచ్.యమ్.టీ వాచ్ కాంబి నేషనుతోనే) కాని ఆమెని ఏ కాలంలోనూ కూడా నూలుచీర కట్టుకోనివ్వడు.

"నీకు శిల్కు చీరెలెంతో బావుంటాయి" అన్న అర్ధ సత్యంతో ఆమెని మోసగిస్తాడు కాని "నూలుబట్టలు వేసుకొంటే అడుక్కు తినే దాన్లా ఉంటావు" అన్న పూర్తి సత్యం ఆమెకి ఎప్పుడూ తెలియనివ్వడు. అంతేకాదు తను ఏకపత్నీవ్రతుడు. అతను కట్టిన అబద్ధాల ఉయ్యాలలో ఆమె మనసు ఎప్పుడూ హాయిగా నిద్రిస్తుంది.

ఔను, అతను ఏకపత్నీ వ్రతుడుకాదు. దానికి చివర రుజువు, కిందటి నెలలో నసీరుఖానింట్లో చేసిన జల్సానే, హబ్బ! హైదరాబాదు హైమ, భర్త వున్నాడన్న లక్ష్యం కూడా లేకుండా తనని కారులోకి యెలా తోసుకుపోయింది! What a daring little devil: హైదరాబాద్ హైమ అంటే జ్ఞాపకం వస్తుంది, పదేళ్ళ క్రిందట పద్మ. పదేళ్ళేకింద ఒక డిస్టెంట్ Cousin పెళ్ళిలో పద్మకు పెళ్ళి కాలేదనే తను తీసిన భోగట్టా తప్పు అయి ఆమెను డేరింగ్ గా డేష్ కొట్టేశాడు. అప్పుడామె అదురుతున్న అధరాలతో 'హేయ్ మిష్టర్!" అంది. కోపంతో ఆమె చెంపలు పగిలి పోతాయా అన్నంత యెరుపెక్కి పోయాయి. ఆమె ముక్కు మూడంగుళాలు పొంగింది. కోపంలో ఆమె యింకా యెక్కువ అందంగా 'ది ఫ్రౌనింగ్ ఏంజల్' – ఆగ్రహంలో వున్న అప్సరసలా వుంది.

'వాట్ మిస్!' అన్నాడామెతో తనకేం తెలియనట్లు రాజ్‌కపూర్లా.

"షి ఈజ్ నాట్ ఎమిస్, షి ఈజ్ మై వైఫ్" అన్నాడు దగ్గరలో వున్న ఒక సోడాబుడ్డి కళ్ళజోడుగాడు.

"ప్లీజ్డ్ టు మీట్ యు" ఆ మొగుడుగాడ్ని కౌగిలించుకొని, ముద్దెట్టుకున్న పనిచేసి తప్పించుకున్నాడు ఆగండం. కాని రెండు రోజుల్లో ఆ సోడాబుడ్డిగాడికి బెస్టుఫ్రెండ్, వాడి భార్యకి బెస్టు లవర్ అండ్ ది బెస్ట్ ఆఫ్ ఆల్ లవర్స్ అయిపోయేడు. సోడా బుడ్డికి ఎంత్రోపోలజీలో డాక్టరేటుందిట. అతను కొద్ది రోజుల్లో ఆఫ్రికా వెళతాడట. "రైట్ ప్లేస్ ఫర్ హిమ్" అంది పద్మ, ఆనంద రావు వడిలో వాలిపోతూ ఆరాత్రి.

"టు యీచ్ హిజ్ ఆర్ హెర్ రైట్ ప్లేస్" అన్నాడు ఆనంద రావు ఆమెని దగ్గరకు తీసుకుంటూ.

హైమా; పద్మా, మచ్చల మొహం మంత్రసానీ, డాక్టర్ డైసీ, పొడుగుకాళ్ళ హెడ్‌మిస్ట్రెస్, తూర్పువీధి పళ్ళకోమటిదీ. ఇలా అతని పరిచయస్తుల లిస్టు ఎంతైనా పెంచవచ్చు. వాళ్ళల్లో కొందరు అతనికి గుర్తేలేరు.

కాని ఎన్నటికీ మరపురానిది తన తొలి ప్రేయసి మంగమ్మ. మంగమ్మ వాళ్ళ దాసీయే. వారానికోసారిగాని జుట్టు దువ్వేది కాదు. నెలకోసారిగాని చీర మార్చేదికాదు. కాని ఎసెక్సీ లిటిల్ బీస్ట్ హూ న్యూ ఆల్ ది ట్రిక్స్. ఆమె చెయ్యి తొలిసారి ఆనంద రావు పట్టుకునేసరికి అతనికి పద్దెనిమిదేళ్ళు ఉండొచ్చు. అప్పు డది అమ్మతో చెప్తానని భయపెట్టింది. అర్ధరూపాయిచ్చి తప్పించు కున్నాడు. మరి దాని జోలికి వెళ్ళలేదు. అదే ఒకనాడు 'నీ దయిర్య మేపాటో సూద్దారని అలాగ నేసేను. ఉట్టి సెవులపిల్లివి. మళ్ళీ కావరానికి నూత్తరం పులిపిల్లే" అని యిన్‌వైట్ చేసింది. అప్పుడతను పుల్పిల్లేకాదు, పులైపోయాడు. మంగమ్మే నేర్పింది. "యీ పొద్దొద్దన్నది మలిపొద్దు రమ్మంటాది. బజార్నంజ కూడా బుజాలిచ్చీదు తొలిసుట్టే. ఆడదాని మనసు నీకేటి తెలుసు" అని.

"నిజమే! అప్పుడతనికి ఆడదానిమనసు గురించి ఏమీ తెలియదు తర్వాత తర్వాత ఆడదాని గురించి అంతా కాక పోయినా చాలామంది ఆడవాళ్ళ గురించి చాలా తెలుసుకు న్నాడు. ఆలోచి స్తూంటే చాలా మంది గుర్తుకొస్తారు. మంగమ్మ తర్వాత బోలెడు మంగమ్మలనీ మిస్సమ్మలనీ చూసేడు, మంగమ్మ బోణీ బహుదొడ్డది.

పోయిన ఇంటర్మీడియేట్ మరి వేసనవని అనుకొనే రోజు లవి. మంగమ్మ దగ్గరే స్వర్గం తాళాలున్నా యనుకునే రోజులు.

కాని నాన్నపోయి కింద భూమి, నెత్తిమీద ఆకాశం పగిలి

వెన్నెల ఆరిపోయి నరకం పొగలు ఉక్కిరి బిక్కిరి చేయగా అతను ఆస్తి అంతా పోగొట్టుకొని వేలువిడిచిన మేనమామ పరంధామయ్య ఇల్లు చేరుకున్నాడు.

మేనమామ పరంధామయ్య పరమ బద్మాష్. అతనికి చాలా ఆస్తి వుంది. చాలా పవర్ వుంది. గాదిదకి కొమ్ములు తెప్పింగలడు బంట్రోతుని "బాస్" చెయ్యగలడు; "బాస్"ని మహమ్మాయ్ వండీగలడు. అతని కూతురు రత్న మాణిక్యాంబ రత్నంకాదు, మాణిక్యం కాదు. తారులో ముంచిన అమ్మవారి బొమ్మలా వుంటుంది. ఆమెకి అందం లేదు. చదువులేదు. పెళ్ళిలేదు. కావలసిన వయసు వుంది.

"మా రత్తాల్ని చేసుకుంటే నీకు ఉద్యోగం వేయిస్తా"నని క్రూడుగా పరంధామయ్య అనలేదు. కాని ఆ అర్థం వచ్చే మాటలే ఆనందరావుతో అన్నాడు.

దేవుఁడెదురు తిరిగినప్పుడు బస్సులు బళ్ళవుతాయి. నాకు ఉద్యోగం లేదు. వుద్యోగం వచ్చే ఛాన్సుకూడ లేదు. చదువుకూడా తగినంత లేదు. ఆకలి కడుపువాడికి అప్సరసొచ్చినా ఒకటే; అంట్లచ్చి వచ్చినా ఒకటే నాకు. అర్జంటుగా కావలసింది మొగుడు. జన్మలో ఆడదాన్ని చూడని వాడుకూడా దాన్ని చేసుకోడు. కాని నేనొప్పుకుంటా. నేనొప్పుకోడం "మేల్ ప్రోస్టిట్యూషన్ లీగలైజ్డు ఇన్ ది షేప్ ఆఫ్ మేరేజ్ కావచ్చు. ఏదైనా అవనీ. నేను సిద్ధం" అనుకొని "సిద్ధం" అన్నాడు బైటికి ఆనందరావు.

తర్వాత రత్తమ్మ రథంలా కాపరానికి వచ్చింది. "ఈ ప్రపంచంలో న్యాయం అంటూ వుంటే మంగమ్మ అంట్లు, రత్తమ్మ తోమాలి" అనుకునేవాడు ఆనందరావు. ఈ ప్రపంచంలో న్యాయం లేదు కాబట్టి యెంత మంచి హృదయమున్నా మంగమ్మ అంట్లు తోముకుంటుంది. "ఛీ! దీనికి పీకల్దాకా కడుపేగాని హృదయం లేదు" అనుకునేవాడు ఆనందరావు రత్తమ్మ గురించి. ఆమెకు సినిమా సరదాలేదు. వంటరాదు. చదువురాదు! సంగీతం రాదు. కుట్లురావు. భోంచెయ్యడం వచ్చు. ఆమె భోంచెయ్యనప్పుడు టిఫిన్ తింటూ వుంటుంది. భోజనం టిఫినూ లేనప్పుడు నిద్దరపోతుంది. అంచేత పెళ్ళయిన ఐదేళ్ళలో వాతం చేసిన ఆడ ఏనుగులా ఐపోయింది.

ఆనందరావు మాత్రం పందెపు గుర్రంలానే వున్నాడు పెళ్ళికి ముందు పోయిన ఇంటర్మీడియేట్టు, పెళ్ళయ్యేక మరో మూడు సార్లు పోయింది. అంచేత అతను పరంధామయ్యకి యెంత ఇన్ఫ్లుయన్స్ వున్నప్పటికీ సబిన్స్పెక్టరు మాత్రం కాగలిగేడు.

తొండముదిరితే ఊరసవిల్లి అవుతుంది. ఊసరవిల్లి ముదిరితే చచ్చిపోతుంది– కాని మొసలి అవదు. సబిన్స్పెక్టర్లు చాలా మంది సర్కిలిన్స్పెక్టర్లు అవుతారు కాని డీయస్పీలు అవరు. ఎక్కడో  ఆనందరావులాంటి వాళ్ళు తప్ప.

ఆనందరావు యిప్పుడు కాస్త పాతబడ్డ చావర్లేట్ కారులా వుంటాడు. రత్తమ్మ మాత్రం ముసలి ఏనుగులా అయిపోయింది.

❖ ❖ ❖

బంగాళా వరండాలో పాకిన సంపంగి తీగె వెన్నెలని చిక్కగా వడబోసి వరండాలో అక్కడా అక్కడా పన్నీరులా జల్లుతోంది. శీతాకాలం పోతూండడంవల్ల రాత్రి కన్నతల్లి చూపులా చల్లగానూ ప్రియురాలి సైగలా వెచ్చగానూ వుంది.

ఆనందరావు చేతిలోని సిగరెట్టుపొగ శోభనం గదిలో ఊదొత్తి నీలిపొగలా విలాసంగా వంకీలు తిరు గుతూ పైకి లేస్తూంది.

అంతవరకూ కళ్ళుమూసుకొని ఆలోచిస్తున్న ఆనందరావు కళ్ళు విప్పేసరికి సిగరెట్టు పొగలోంచి వరండా చివర మెటీరియలైజ్ (materialise) అవుతున్న అప్సరసలా మరకతం వెంకట్రామన్ కనిపించింది!

పలుచటి నీలి చీకటిలో ఎర్ర అత్తరు దీపంలా ఆమె మనోహరంగా ఉంది.

మరకతం అసలుపేరు మరకతం కాదు; వెంకట్రామన్ అసలుపేరు వెంకట్రామన్నూ కాదు. అతను మరకతానికి భర్తా కాదు, తొలి ప్రియుడూ కాదు; రెండో ప్రియుడూకాదు. అతనికి దూరదేశంలో ఒక భార్యా, ముగ్గురు పిల్లలూ వున్నారు. అతను సినిమాల్లో వెయ్యడానికి కావలసినన్ని నాటకాలు వేసి, సినిమా ఛాన్సుకోసం మద్రాసు వెళ్ళాడు. ఒక సినిమాలో డాక్టరూ, మరోదాన్లో సబిన్స్పెక్టరూ వేసేడు కూడా. మరింక సినీమాల్లో ఛాన్సులు దొరకవనుకునేటప్పటికి అతనికి మరకతం దొరికింది.

మరకతం అసలుపేరు మాణిక్యం. ఆవిడ ఒక బీద సంగీతం మేష్టారి కూతురు. ఆమెని సరస్వతి చల్లని చూపు చూసి ఆమెకి అతి శ్రావ్యమైన కంఠస్వరం ఇచ్చింది. ఆమె తండ్రి దగ్గరే సంగీతం నేర్చుకుంది. ఆమె బీదదవడంవల్ల పెళ్ళి కుదిరేలోగా కచ్చేరీ చేసే పాండిత్యం సంపాదించుకొంది. స్కూల్ ఫైనల్కూడా పేసయింది.

ఆమెకి తన యల్డీసీ (గుమాస్తా) మొగుణ్ణి చూస్తే, మొద

ట్నుంచీ కిట్టలేదు. ఆమెకి తనజీవితం గురించి మధురమైన కలలు వుండేవి. యల్డీసీగాడి అంట్లుతోముతూ, వాడి పిల్లలకి తల్లిగా జీవితం గడిపెయ్యడం ఆమెకి వాస్తవిక పీడ కలలా కనిపించింది.

అంచేత పెళ్ళయిన మూడేళ్ళకే పక్కింటి నాటకాల కంపెనీ వుంగరాలజత్తు గాడితో లేచిపోయింది. ఆమె దగ్గరున్న రెండు బంగారు వస్తువులూ హరించిపోయేవరకూ ఆమెకి చంద్రుడు పగలుకూడా ప్రకాశించేవాడు. తర్వాత ఇద్దరూ నాటకాలు వేశారు, పాటలు పాడేరు. ఈలోగా వుంగరాల జట్టువాడికి వుంగరాల జుట్టు హీరోయిన్ దొరికింది.

తర్వాత మరకతం కొన్నేళ్ళు కష్టాలు పడింది. ఆ తర్వాత ఆమె దశ అందుకొంది. ఆమెకి కచ్చేరీ ఛాన్సులు వచ్చేయి. డబ్బూ, పేరుకూడా ఆర్జించుకొని సినీమాఛాన్సు కోసం మెడ్రాసు వెళ్తే సినిమాఛాన్సు దొరకలేదు గాని వెంకట్రామయ్య దొరికేడు.

వెంకట్రామయ్య తనకు కావలసిన బ్రాందీకి, మార్ఫీయాకి మరకతంమీదనే పూర్తిగా ఆధారపడిపోయాడు. వాటికి కావలసిన డబ్బు ఆమె ఏవిధంగా తెచ్చినా అతనికి ఫరవాలేదు అంచేత ఆమె అన్ని విధాలా తెచ్చేది.

మరకతం అచ్చు అరవదాన్లా వుంటుంది. బారెడు అంచున్న బనారసు చీర కుడి పమిట వేసుకుంటుంది. ఆవిడ ముక్కునున్న అసలు వజ్రం చీకట్లో ఒంటి నక్షత్రంలా పెద్దగా మెరుస్తూ వుంటుంది. ఆమె తరచూ తమలపాకులు వేసుకోవడం వల్ల ఆమె తెల్లగా వున్నా ఆమె పెదిమలు మాత్రం అతి యెర్రగా వుంటాయి. ఆమె అరవ యాసలో తెలుగు మాటాడుతుంది.

ఆవిడని చూస్తే ఏ మొగాడికీ తల్లీ చెల్లీ జ్ఞాపకం రారు. గిఫ్ట్ పేకింగ్ చేసిన సెక్స్ యాపిల్ లాగుంటుంది.

ఆమె జుత్తు దువ్వుకొని, కొత్తచీర కట్టుకొని వుంటే ప్రియుడి కోసం వేచివున్న అభిసారికలా వుంటుంది. ఆమె చీర నలిగి, జట్టురేగి వుంటే అప్పుడే ప్రియుడ్ని పంపిం చేసిన ప్రేయసిలా వుంటుంది.

ఆమె "మరులు కొన్నానురా" అన్న జావళీ పాడితే విశ్వామిత్రుడు కాదు సరిగదా, వషిష్టుడే తపస్సు వదిలేస్తాడు.

ఆవిడ రోడ్డుమీద నడుస్తూ ఉంటే మగ కుక్క కూడా ఆమెవేపు మరోసారి చూస్తుంది.

రమారమీ మొగకుక్కలాంటి ఆనందరావు మరో సారీ మరోసారీ ఆమెవైపు చూసేడు. చూపు కోరిక అయి, అతని వళ్ళు వేడెక్కిపోయింది.

అతను చాలా రకాల ఆడవాళ్ళను చూసేడు. వివాహితలు, వెధవ ముండలు, మిస్సమ్మలు, మంత్ర సాన్లు, నాటకాల వాళ్ళు, నాట్యాలవాళ్ళు, ప్రొఫెషనల్స్, హాబీయిస్టులు అతని పరిచయస్తులలో కొద్దిమంది మాత్రమే. కాని, అతను ఎప్పుడూ సంగీత విద్వాంసురాలితో భుజం కలపలేదు. ఆ అనుభూతి యెలా వుంటుందో అన్న తలపు రాగానే అతని ఎముకల్లో ఒక విధమైన పీకు ప్రారంభం అయింది. అతని సంగతి అతనికి పూర్తిగా తెలుసు. అతనికి కలిగిన ఏ కోర్కె అయినా తీరేవరకూ అతనికి మెదడులో మేకు గుచ్చుకుంటున్నట్టుంటుంది.

అంచేత ఆనందరావు చొరవచేసి తన్ను తాను మరకతానికి పరిచయం చేసుకున్నాడు. ఆవిడ ఆవూరు ఏదో పెర్ఫార్మెన్సుకి వచ్చిందట. గమ్మత్తుగా వుంది. అతనూ ఆ ఊరు ఏదో ఇన్స్పెక్షన్‌కి వచ్చేదు. ఆమె ఆ ఊళ్ళో మూడు రోజులు వుంటుందట. మరీ గమ్మత్తుగా ఉంది, తనూ ఆ ఊళ్లో మూడురోజులే వుంటాడు.

అతని కంటికి ఆమె పరమ పతివ్రతలా కనిపించలేదు. కాని ఆ మూడురోజుల్లో చూపుల్తో చుట్టెయ్యడం, పొరపాటున తగిలినట్లు చేతులు ఆమెకు తగిలించడం తప్ప ఎక్కువ చొరవ చెయ్యలేకపోయేడు. ఇలాంటి వాళ్ళతో మరీ అంతతొందర పనికిరాదు. అందులోనూ మెడ్రాసుసరుకు. (వెనక డాన్సర్ ధనమ్మాళ్ చెయ్యి చొరవచేసి పట్టుకున్నప్పుడు సరిగ్గా ఆ టైముకే ఎవడో జులపాల జుత్తుగాడు ఆమె మొగుడ్నంటూ వచ్చి ఎంత రచ్చ చేసేసేడు!)

వారు విడిపోతున్నప్పుడు "మా పోలీసు వెల్‌ఫేర్ ఫండుకి ఏభైవేలు పోగుచేసేం. రెండువేల వరకు ఎంటర్ టయిన్మెంటుకి ఖర్చు చెయ్యొచ్చు. పోలీసువాళ్ళకి పాటేమిటని కొట్టి పారెయ్యకపోతే మీ కన్సర్టొకటి పెట్టుకుందాం" అంటూ ఆనందరావు ప్రాధేయపడ్డాడు.

ఆవిడకి అభ్యంతరమా? రామ! రామ! అందులోనూ రెండు వేలు! "మీ డేట్స్ రాయండి, ఇతర ఎంగేజిమెంట్సు లేకపోతే తప్పకుండా అంగీకరిస్తా" అంది చూపుల్తో రెండువేల నొక్కులు నొక్కుతూ...

❖ ❖ ❖

ప్రోగ్రాంకి వారం ముందొచ్చి వారం తర్వాత వరకూ

వుండిపోయింది మరకతం. ఆ పదిహేను రోజులూ ఆనందరావు పగలు పని మానేసేడు; రాత్రిళ్ళు నిద్రమానేసేడు.

"యీ ముండెవర్తో పెర్మనెంటుగా వుండిపోతే బావుణ్ణు" అనుకున్నారు అతని బాధపడ్లేని సబార్డినేట్సు.

రేపు వెళ్ళిపోతుంది మరకతం రేపే! రేపే! రేపే!!

రాత్రి పదకొండైంది. ట్రావెలర్స్‌బంగళా వరండాలో కూల్ డ్రింక్సు సిప్‌చేస్తూ కూర్చున్నారు, మరకతం ఆనందరావూ.

తామరలూ, కలువలూ కలిపినట్లు మనోహరంగా ఉంది మరకతం.

ఎర్రపోలీష్ చేసిన మరకతం చిటికెన వేలు గోరులో కెంపులా మెరుస్తున్న చంద్రుడ్ని ఆనందరావు మరోసారి ముద్దు పెట్టుకున్నాడు.

గ్లాస్ టాప్ టేబుల్‌మీద ఒలికిన నీళ్ళల్లో ఉన్న రెండు నక్షత్రాలూ ఈ చోద్యం చూసి సిగ్గుతో వణికి పోయాయి.

ఆ నక్షత్రాల సిగ్గుకు వడలు పులకరించిన చల్లగాలి తెల్ల బోగిన్ విల్లీ పువ్వులను మరోసారి గిలిగింతలు పెట్టింది.

మరకతం కళ్ళలో రెప్పల అంచున తొణికిసలాడుతున్న నీలిరంగును మారోసారి చూసి "ఇక నే వెడతా, మాకు క్వార్టర్ ఎండ్ పనివుంది" అంటూ లేచాడు ఆనందరావు.

దారిలో టూ టౌన్ స్టేషన్ దగ్గరాగి, హెచ్.సి. 22తో "ఎల్లుండి క్వార్టరెండ్, ఇంతవరకూ మరచేపోయాను. కాస్త యస్.ఐ.టి. ఆక్టు (బ్రోతల్ ఏక్టు) కేసుల సంగతి చూడు" అని చెప్పి ఆనందరావు వెళ్ళిపోయాడు.

❖ ❖ ❖

హెచ్.సి.ట్వెంటీ టూ అసలు పేరు కనకయ్య. ఆర్జించుకున్న పేరు డబుల్ డేంజర్. అతను ఇంకో రెండేళ్ళలో రిటైర్ అయి పోతాడు. తన రెండువందల పౌనుల బరువుకీ తగిన ఎత్తు వుంటాడు. అతను కాలంలో వున్నప్పుడు నీ కుడిచెయ్యి పీకేసి దాంతోనే నిన్నుకొట్టి చంపేస్తాడన్నంత బలంగా వుండేవాడు. ఇప్పుడు వయసు మళ్ళి రెండేళ్ళ క్రిందట సున్నం వేసిన గోడలా కాస్త మాసినట్టు కనిపించినా రాతి గోడలా బలంగా ధైర్యంగా కనిపిస్తాడు. కాస్త పాతబడిన జోడుకి దిట్టంగా బ్రాస్ పోలిష్ చేసినట్టుంటుంది అతని మొహం. అతనికి తన యూనిఫారం మీద భక్తితో కూడిన గౌరవం వుంది. దాని లోహపు గుండీలు రాజముద్రికలులా కనిపిస్తాయతని కంటికి.

అతనికి న్యాయాన్యాయాల గురించి, ధర్మా ధర్మాల గురించి దృఢమైన నమ్మకాలు ఉన్నాయి. దొంగవెధవ ఎప్పుడో వొకప్పుడు దొంగతనం చెయ్యక మానడు. పడుపు వృత్తిది తన వృత్తి మానదు. వాళ్ళు నేరం చేసినప్పుడు దొరుకుతారన్న గేరంటీ ఏమిటి? అంచేత వాళ్ళమీద ఎడ్వాన్సుగా కేసులు పెట్టడం న్యాయం. జామీను కేసుల్లోనూ బ్రోతెల్ ఏక్టు కేసుల్లోనూ ముద్దాయిలు నేరం వప్పేసుకోవడం ధర్మం. ఇవి అతని అభిప్రాయాల్లో కొన్ని మాత్రమే.

ఊరంతా కొల్లగొట్టినా డబుల్ డేంజరుకి "పదిమందిరి ముండలు" కంటె దొరకలేదు. "మరో పదిమందిరన్నా దొరక్క పోతే పీక్కొరికేస్తాడా పళ్ళబాబు" అనుకుంటూ అతను సినిమా హాలు దగ్గర టీషాప్ చేరేసరికి అక్కడ దగ్గరుండి "టీ" కలిపించు కుంటున్న "వైరు" కనిపించాడు.

"మరి కసిన్ని పాల్బుక్కలెయ్య లంజికొడుకా! అవేటి చను బాలనుకుంటున్నా వేటి, అలా కొసుర్తున్నావ్!" అని వైరు టీ కుర్రాడితో అంటుంటే అతని వెనుకాలే వెళ్ళి "ఏరా వైరూ!" అని ఆప్యాయంగా పిల్చి "ఎప్పుడొచ్చినావ్" అని కలిపేడు డబుల్ డేంజర్.

వైరుని "ఏరా వైరూ" అని సన్యాసమ్మని తప్పిస్తే డబుల్ డేంజరు యమడూ మాత్రం పిలవగలరు. అతనికి సన్యాసమ్మని చూపినా హేడ్డుని చూసినా యమ్ముణ్ణి చూసినా ఒక్కలాంటి భయమే.

"మొన్నగురూ' అని వైరు భయం భయంగా జవాబిచ్చి "ఎక్కడి కిలా బైలెల్లినావ్? అని కలిపేడు.

వైరుకి నలభై సంవత్సరాలు దాటి వుండొచ్చు. మనిషి బక్క పలచగా వుండడం వల్ల మరోపదేళ్ళు పోయేకన్నా నలభై ఏళ్ళ వాళ్ళాగే కనిపిస్తాడు. అతని జుట్టు అతినల్లగా వుండడం వల్ల అతనికున్న నలభై ఏళ్ళు అతని మొహంలో కనిపించవు. అతని ఉంగరాలజుట్టు మధ్య పాపిడితీసి మీదకు ఎగదువ్వడం వల్ల పందెపు గొర్రెపోతులా కనిపిస్తాడు అతను. అతను ఎప్పుడూ సన్యాసమ్మకి ఇష్టమైన గ్లాస్కోపంచె కట్టుకొని గ్లాస్కో లాల్చి తొడు క్కుంటాడు. నవ్వినప్పుడు అతని కారాకిల్లీ నోరు అతినల్లగా, పులి గుహలా కనిపిస్తుంది.

అతని చిన్నతనం అతనికే గుర్తులేదు. అతనికి కాస్త జ్ఞానం వచ్చేసరికి బస్సులదగ్గర మూటలుమోస్తూ వుండేవాడు. ఇం కొంచెం వయసొచ్చేసరికి బస్సులూ లారీలూ కడిగే వాడు.

పూర్తిగా అతనికి వయసొచ్చేసరికి సన్యాసమ్మ అతన్ని చేరదీసింది.

సన్యాసమ్మకి బాహాటంగా రవిక విప్పేసుకొని బస్ స్టాండులో తన బడ్డీకొట్టుమీద కూచునే వయసొచ్చేసింది ఇప్పుడు. ఆమె లావుగా ఎత్తుగా కిలంపట్టిన కంచు విగ్రహంలా వుంటుంది. ఆమె నవ్వినప్పుడు ఆమె పంటి చిగుళ్ళు (గమ్స్) అతి ఎర్రగా కనిపించి పరిగెత్తలేని కప్పనిచూసి పాము నవ్వినట్లు భయం కరంగా వుంటుంది. చస్తే అంగుళంన్నర దంతపు బొమ్మలు చెక్కించుకోవచ్చు అన్నంత వుంటాయి ఆమె పళ్ళు. ఆమెకి రౌడీలంటే భయంలేదు. పోలీసులంటే భక్తి లేదు. ఎంతటివాణ్ని అయినా కాలరు పట్టుకొని రోడ్డుమీద నిలబెట్టెయ్య గలిగిన శక్తి ఆమెకు వుంది.

సన్యాసమ్మ మొగుడు ఆత్మహత్య చేసుకున్నాడో, ఖూనీ అయి పోయాడో అతనికే తెలీదు, సన్యాసమ్మకి మాత్రం తెలుసు.

"వైరు"ని చేరదీసేక సన్యాసమ్మ ప్రణయ జీవితం ఒక దారిని పడ్డాది. ఆ తర్వాత ఆమె పరపురుషుణ్ని కన్నెత్తి చూడలేదు. (ఏదో మొగుణ్ని కట్టుకున్నాక కూడా పాతివ్రత్యం కుదరొచ్చు అనడానికి మరో నిదర్శనం)

సన్యాసమ్మ "వైరు"కి తిండీ బట్టా రోజుకి రెండు చార్మినార్ సిగరెట్టు పెట్టెలూ ఒక అగ్గిపెట్టె మాత్రం ఇస్తుంది ఇంకేం యివ్వదు. తన సారాకీ జల్సాలకి కావలసినడబ్బు వైరు చూసు కోవలసిందే. కాబట్టి అతను జైల్లో లేనప్పుడు జేబులు కొడతాడు.

సన్యాసమ్మని "వైరు" తనకోసం ప్రేమించలేదు, తిండి పెడు తున్నాదన్న విశ్వాసం కూడా అతనికి లేదు. "ఎవడి కోసం ఎడద్దీ? తయారు తిండెడితే మాత్తరం నాలాటి రాజా ఎలాగొ స్తాడేటి ఆదీపల సమ్మేకి?" అని అతను బాహాటంగానే అంటూ వుంటాడు.

సన్యాసమ్మకి అతను కావాలి. అతనికి సన్యాసమ్మ డబ్బు కావాలి. అంచేతనే వాళ్ళిద్దరూ కలిసి వుంటున్నారు. వాళ్ళది కేవలం బిజినెస్ రిలేషన్. ఇంకెవరేనా పోషిస్తామంటే "వెళ్ళొస్తా" నని సన్యాసమ్మతో చెప్పకుండానే వెళ్ళిపోతాడు "వైరు".

❖ ❖ ❖

హెడ్డూ "వైరూ" టీ తాగేక "నీతో పనుంది, రా" అన్నాడు హెడ్డు.

"మళ్ళీ జామీను కేసు గుద్దేస్తావేటి? జామీను నువ్విచ్చు కుంటానంటేనే" నీరసంగా నవ్వేడు వైరు.

"అది కాదెస్, తర్వాత సెప్తాగాని, స్టేసను కెల్లితొంగో" అని లేచాడు హెడ్డు.

పోలీసు స్టేషనులోనూ సన్యాసమ్మ ఇంట్లోనూ ఒక్కలాగే పడుకోగలడు వైరు. అంచేత లోపల తిట్టుకుంటూ వెళ్ళిపోయేడు అతను.

హెడ్డు "మరో పది మంది"ని వెతుక్కుంటూ ముత్యాలమ్మ ఇంటికి చేరేడు.

ముత్యాలమ్మ కమ్యూనిష్టు కాదు. సోషలిస్టు కాదు. ప్రతీ వ్యాపారానికి పెట్టుబడిదారు వుండాలనీ, లాభాలు పెట్టుబడి దారువే నన్న సింపుల్ ప్రిన్సిపుల్ మీద ఆమె వ్యాపారం నడుపు తోంది. చిన్నప్పుడే ఆమె చాలా చేతులు మారడం వల్ల వయసుకి మించిన జ్ఞానం వచ్చి, తను చేస్తున్న పడుపువృత్తి పెట్టుబడిదారీ మార్గంలో నడుపుకుంటేనే లాభదాయకమని చిరకాలం కిందటే గ్రహించి ఊరవతల ఒంటి స్తంభంమేడలాంటి మేడలో తన కంపెనీ పెట్టింది.

ఇప్పుడు ఆమె వయస్సు ఎవరూ చెప్పలేరు. ఏలెక్కని చూసినా నలభైఐదుకి తక్కువ వుండవు. ఆమె నడి వయస్సులో వున్నప్పుడు కొవ్వు రాసుకున్న ఖడ్గమృగంలా ఏ అవయవానికి ఆ అవయం ప్రత్యేకంగా అతికినట్లు అతిబలంగా కనిపించేది. ఆమె వీపుమీద, జాకెటుకింద కండలు వేలాడుతూ వుంటాయి. వయసు మూలాన ఆమె కండలు మెత్తబడి కొన్ని గంటల కింద ఊదిన రబ్బరు బెలూనులా తవ తవలాడుతూ వుంటుందామె. ఆమె వీపు మధ్య నిలువునా వున్నలోతు, బండల మధ్య యెండి పోయిన వాగులా వుంటుంది.

ఆమె నిన్నటి నుంచీ కట్టుకున్న తెల్లవాయిలు చీర కొన్ని గంటలకింద మాత్రం కట్టుకున్నట్లు అతికొంచెం నలిగి ఉంటుంది. ఆమె ఇప్పటికీ ఆరోగ్యంగా కనిపిస్తుంది. ఆమె మూడు రోజులు భోం చెయ్యక పోయినా ఇప్పుడే దాగరంత దోసెలు మూడు తిన్నట్టు బలంగా కనిపిస్తుంది. బాగా అర్జించి ఏక్టివ్ ప్రేక్టీసు మానేసి ఛేంబరు ప్రాక్టీసు మాత్రం చేస్తున్న ప్లీడర్లా హుందాగా ఉంటుందామె. హేదులాంటి పాత పరిచయస్తులని, ఆమె ఇప్పటికీ వరూధిని ప్రవరాఖ్యుడ్ని చూసి నట్టు చూడగలదు.

వారంతా ఆమె హృదయం నిజంగా చూరగొన్నారు.

ముత్యాలమ్మ ఇల్లు హేడ్డు చేరిన చాలా సేపటికి–

ముత్యాలమ్మ ప్రత్యేక గదిలో పందిరిమంచం మీద మంచానికి సరిపడా అలసిపోయినట్లు పడుకొని ఉన్నాడు హెడ్డు. ఆ గదిలో బూజూ బుగ్గీ భూతద్దంతో చూసినా కనిపించవు. ఒకవారగాజు బీరువాలో కొన్ని పట్టు చీరలూ, కొంత సామానూ, ముచ్చటగా సర్దివున్నాయి.

ఆ గదిలో రెండు ఎదురు గోడలకు ఎవరేనా తను వెనుక అందం, ముందు చందం ఆరుసార్లు అన్ని సైజులలోనూ చూసుకోడాని వీలయ్యేటట్టు రెండు నిలువుటద్దాలు వేలగట్టి వున్నాయి.

మిగతా రెండు గోడలకి అద్దాలు కట్టిన రెండు పెద్ద సైజు ఆడబొమ్మలు వేలాడగట్టి వున్నాయి. ఒక పటంలో స్త్రీ ఒక పందిరి మంచంమీద కూర్చుని పరధ్యానంగా కిటికీలోంచి అవతలకి చూస్తోంది. ఆమె బట్టలు కట్టుకుంటూందో విప్పుకుంటూందో చెప్పడం కష్టం. ఏం చేస్తున్నా ఆమె సగమే చేసింది. రెండో పటంలో స్త్రీ అటువంటి సందేహం రానివ్వదు. ఆమె పూర్తిగా బట్టలు విప్పేసుకుని పూలతోటలో "తై" అని గెంతుతున్నది.

"కీళ్ళు పట్టేసీ వొయసొచ్చినా నీకీ 'ఇది' పోలేదు. సుమీ" అంది ముత్యాలమ్మ, తనా 'ఇది' ఎన్నాళ్ళ కిందటో కాశీలో వదిలేసినట్టు.

"ఏటోనే" అంటూ లేస్తూ మూలిగి లాల్చీగుండీలు పెట్టుకున్నాడు హెడ్డు. తర్వాత ఆ మాటా ఈ మాటా చెప్పి అసలు విషయంలోకి దిగేడు.

"అదికాదు గాని ముత్తెం, నువ్వేం అనుకోకపోతే నిన్నోటి అడుగుతా" అని ఎపోలజెటిక్‌గా అంటూ "మాకు ఈపాలి కేసులు తక్కువొచ్చినాయి. రెండు కేసులు సర్దిపెట్టావంటే సచ్చి నీ కడుపున పుడతా" అని బ్రతిమాలేడు.

ముత్యాలమ్మ తోకమీద నిలబడిపోయి బుసకొట్ట ప్రారంభించింది. "మరోరి కడుపునబుట్టి ఈ జనమలో ఇంత సేసేవే! నా కడుపున పుట్టి ఇక ఉద్ధరిస్తావా" అని అతన్ని ప్రత్యేకంగా తిట్టింది; పోలీసువాళ్ళని జనరల్‌గా తిట్టింది. తన కిందపని చేసే అమ్మాయిలనీ వాళ్ళకోసం వచ్చే సరసుల్నీ కూడా తిట్టింది.

"సూస్తే సూస్తే డాట్టర్ల బిల్లులకి అధికార్ల మామ్మూళ్ళకే నే నీ యాపారంలో దిగినట్టుంది. నీ కేటన్నాన్యాయం వుందీ? ఉహూఁ ఉందా అని? నాకు తెలకడుగాతా గాని కేసులకీ నా గుంటలే, ఊసులుకీ నాగుంటలే? నీ కేటన్నా నీతుందా? ఎదవ ముండకాడ ఎదురి బేరంగోడివి, నీతో నా కేటి? ఎల్లెల్లు" అని పీకపట్టుకొని గెంటేసినంత పనిచేసి "ఏదో గుట్టుగా బతుకుతున్న నామీదొడకపోతే కాలవ్వార కొత్తగుడిసెల్నె గిసినాయి. ఆళ్ళనట్టకోగూడదూ?" అని ముగించి పీకమీద చెయ్యేసి హెడ్డుని నిజంగానే గెంటేసింది.

❖ ❖ ❖

మురుగు కాలవ అవతల భూమి, భూదేవి చర్మం ముసలిదైపోయినట్లు పగిలిపోయి వుంటుంది. కాలువ రాత్రి పూట చీకటి మింగిన కొండచిలువలా భయంకరంగానూ, పగటిపూట బుడగల కుళ్ళునీటితో కురుపులైన కొండచిలువలా అసహ్యంగానూ వుంటుంది.

ఆ రాత్రి కాలువవార మర్రిచెట్టు ముడుచుకొని కూచున్న ముసలిపులుల్లా వున్నాయి. వాటిదిగువున్న పది గుడిసెలూ జారిపడిన పక్షిగూళ్ళల్లా దీనంగా వున్నాయి. ఒకటి తప్ప అన్ని గుడిసెలూ తలుపులు వేసేసి వున్నాయి. తీసివున్న ఆ ఒక్కగుడిసె చుట్టూ వున్న చీకటి కాటేసిపోతున్న కాలనాగు బుసలా అతి నల్లగా వుంది. తెరుచుకొని వున్న ఆ గుడిసె ద్వారం గుడిసెలోని కిరసనాయిలు బుడ్డీ ఎర్ర వెలుతురికి తెరుచుకున్న ఆకలినోరులా వుంది. ఆ నోట్లో చిక్కుకున్న చేపపిల్లలా ఆ గుడిసెలో ఒక స్త్రీ నల్లని నేలమీద, తప్పు చేసి తల్లిని కౌగలించుకొని ఏడుస్తున్న దానిలా నేలను కరుచుకొని బోర్లా పడుకునివుంది.

ఎప్పుడూ ఆమె నిన్ననల్లా భోంచెయ్యనట్టు నీరసంగా వుంటుంది. ఆమె సగం చచ్చిపోయినట్టూ, సగం జీవించాలని కోరిక లేనట్టూ దీనంగా వుంటుంది. ఏ ఆభరణాలు ఆమెకి అందం యివ్వవు. ఆమె కట్టుకునే తెల్లవాయిలు చీర వెలసిపోయిన రంగుచీరలా వుంటుంది. ఆమె జుట్టు ముడిలోని మల్లెపువ్వులు కిందటేడాది కాగితం పువ్వుల్లా వుంటాయి. ఆమె చౌకబారు పౌడరూ, పెట్టుకునే కుంకుమ ఆమెకు అందం ఇవ్వక పుణ్య స్త్రీ శవానికి రాసిన పసుపు, కుంకుమల్లా వికృతంగా ఉంటాయి. ఎంతనూనె రాసినా ఆమెజుట్టు వంగక కన్నీటికి చెరిగిన కాటుకలా ఎప్పుడూ కొంత చెరిగి వుంటుంది.

కలలు కాలిపోయిన మనిషిలా ఉన్నకంటె ఆమె ఎక్కువ నల్లగా కనిపిస్తుంది. మనిషిని వలిచేస్తే మూడుశేర్ల మాంసం మాత్రం రావచ్చునన్నంత సన్నంగా వుంటుంది.

ఆ రాత్రి కన్నీటికి చెదిరిన ఆమె కాటుక, చేపపిల్లను మింగుతున్న నల్లపామునోరులా అసహ్యంగా ఉంది. ఆమె మూలుగు దారితప్పిన పక్షి ఏడుపులా దీనంగా వుంది. ఆమె నిండు మనిషిలా ఉండక యిక్కడో కాలూ అక్కడో చెయ్యి తెచ్చి చేసిన తోలు దిష్టిబొమ్మలా వుంది. కాని ఆమెను చూసినప్పుడు ఎప్పుడో ఎన్నాళ్ళకిందటో అందంగా ఉండొచ్చనిపిస్తుంది. ప్రపంచంలో ధర్మం వుంటే అందంగా వుండవలసిన వయసులోనే యింకా వుంది.

ఆమె ఊరి సెక్సు కుళ్ళుకి మురికిగుంట.

హేడ్డు ఆమెగుడిసెలో ప్రవేశించాడు. తల్లిరాకకు యెదురు చూస్తున్న లేడిపిల్ల పులిని చూసినట్టు ఆమె జడుసుకుంది. హేడ్డుమాత్రం ఆమెవేపు కదలలేని కప్పపిల్లని పాము చూసినట్టు తృప్తిగా చూసి నవ్వి పలకరించేడు. ఆ మాటా ఈ మాటా అయేక "ఈయేల గిరాకీలేదేటీ" అని అడిగేడు.

"నిన్నకూడ లేదు" అన్నట్టు ఆమె తలవూపింది.

"లెగు"

ఆమె లేచింది.

"నా ఎంటరా" అధికార యుక్తంగా అన్నాడు.

"కొట్లోకైనా కాట్లోకైనా సిద్దం" అన్నట్టు ఆమె అతని వెనకాల నడిచివెళ్ళింది.

❖ ❖ ❖

మర్నాడు మధ్యాహ్నం కాలువ వద్దున పట్టుకున్న మనిషి మీదా, మరో పదిమంది మీదా చార్జిషీట్లు రాస్తున్నాడు హేడ్డు. టైమైపోతోందని తొందరగా రాయమని తొందర చేస్తున్నాడు చార్జిషీట్లు పట్టుకెళ్ళాల్సిన కుర్రకాన్‌స్టేబుల్.

"ఇంకా బోలెడు టైముందిలే. నువ్వేటి అలా గాబరా పడిపోతావు?" ఈ కేసులు మనం ఎప్పుడట్టికెళ్ళినా కోర్టు కాళీ చేయించి సాయంత్రం ఐదయినా కనే తీసుకుంటాడు కొత్త మేస్ట్రీటుబాబు. ఆ బాబుకి వల్లమాలిన సిగ్గు. భార్యదగ్గర కూడా బనీను యిప్పట్ట" అంటూ ఆగేడు హేడ్డు.

కాన్‌స్టేబుల్ కుర్రాడు, ప్రపంచంలో అంతా అన్యాయమే ఉంటుందని తెలియని వయసులో వున్నాడు. అంచేత నిన్న రాత్రి నుంచీ భోజనమైనా లేకుండా వరండాలో పడున్న ఆడవాళ్ళ వేపు జాలిగా చూసేడు.

"ఏటలా ఎర్రిసూపులు సూస్తున్నావ్?" అంటూ ప్రారంభించేడు డేంజర్– "కేసులు నిజంకాదనా? అలా టెర్రాలోశన్లు పెట్టుకున్నావంటే దెయ్యమైనాకనే, హెడ్డువవుతావు. మనం సూడాల్సింది కేసులు నిజఁమాఁ? కాదా? అనికాదు. అసలిలాటి కేసులు నిజంవి ఎక్కడ దొరుకుతాయి? సరసుల్ని పేపర్లు పంచి పిలుస్తారా ఇలాట్లంజలు?

"ఈళ్ళు నువ్వు చూస్తుండగా ఎవర్నేనా పిలుస్తారా? పిలిసినా నీమాట దేవుఁడేనా నమ్ముతాడా? అంచేత మనం సూడాల్సిందిదిగాదు.

మనం సూడాల్సిందేటంటే– దీనివృత్తేటి? ఒళ్ళమ్ముకోడం. దిష్టిబొమ్మ నాగున్నది. దీనికాడ కెవుడెల్తాడు యిది పిలిస్తే తప్ప? అంచేత యిది ఎవణ్నో ఒకణ్ని పిలుస్తూనే వుంటాది, ఎవుణ్ణి పిలిసింది అన్న యిసయం మనకొద్దు, నా నోరసలే మంచిది కాదు. అంత శాత్తరం పెకారం ఎల్తే ఏదో ఔద్దటలే. నాలుగు వారాల నక్కగోడువి నీకేటి తెలుసు కేసుల్సంగతి."

"అసలు నేను వైరుగాణ్ని, నిన్న రేత్తిరి స్టేషిన్లో ఎందుకు తొంగోమన్నానో ఎరికా?" అనడిగాడు.

ఎరికలేదన్నాడు కాన్‌స్టేబుల్.

"అలాగడుగు సెప్తాను. మనం కేసుల్లో ఈ ముండలు ఎవుడో ఒకణ్ణి పిలిసేరని పెట్టాలా; వద్దా? మరి గలాటప్పుడు యీళ్ళు పంచాయితీ పెసిడెంటుని, సమితి సెక్రటీని పిలిసేరంటే యెవుడు నమ్ముతాడు. వైరుగోడ్లాటోణ్ని పిలిసేరంటే అంతా నమ్ముతారు.

"యీళ్ళు నిన్న రేత్తిరి ఒకరి తర్వాతొకరు వైరుగోణ్ని పిలిసేరని మనం కేసులు యెడుతున్నామా? ఈళ్ళెవళ్ళూ కేసులు కంటెస్టు చెయ్యరనుకో. కాని మన్ది పోలీసుజాతి. కట్టుకున్న దాన్ని కనుకున్నోళ్ళనీకూడా నమ్మకూడదు మనం.

"ఈళ్ళలో ఎవరైనా సికండి ముండ 'నాను ఈ వైరుగోణ్ని పిలనేదు ఈడెవడో నాకు తెల్దు. నాను రేత్తిరి కోరటు జవానుకాడ తొంగున్నాను అన్నాదనుకో, అప్పుడు మనకేటి గతి? మనం "వైరుగోణ్ణి" బోనెక్కించక తప్పదు. మరలాటప్పుడు యీ "వైరు" గోడు నిన్న రేత్తిరి ఏ బెజవాడో బరంపురమోఁ పోయి ఎవుడి జోబోకొట్టి కొట్లో దూరిపోనాడనుకో, అప్పుడు మనపనేటౌద్ది? మళ్ళీ ఈ ముండల కేసులు మామూలు కేసులనుకున్నావేటి? అవెంత ముక్యమో తెలుసా? ఎస్సయీ, సీ అయ్యా బాబులు కూడా ఈ కేసు లెట్టటానికి వీల్లేదు. అచ్చంగా డీయస్పీ బాబే ఎట్టాలి.

యిప్పుడరదవై యిందా" అని జ్ఞానోపదేశం చేసేడు హెడ్డు.

మరికొంతసేపటికి చార్జిషీట్లు తయారుచేసి సంతకాలు చేయించి ముద్దాయిల్నీ, కాగితాలనీ కానిస్టేబుల్‌కి వప్పగించి "నువ్వసలే కొత్తోడ్లాగున్నావ్! బయపడిపోక. కేసులునీమీద గాదులే కాయితాల్నీ ముద్దాయిల్నీ కోర్టు గుమాస్తా కప్పగించు. ఆ బాబు సూసుకుంటాడ్లే అంతా. ఇంతకీ ఈళ్ళంతా కేసులు ఒప్పేసుకుంటామన్నార్లే" అన్నాడు హెడ్డు.

❖ ❖ ❖

సాయంత్రం ఐదయింది.

కోర్టులో జనం పలచబడిపోయేరు. సాయంత్రం ఎండ కోర్టు ద్వారంలోంచి భయపడ్డ పసిపిల్లల్లా తొంగిచూస్తూంది.

ఎవరో జైలుకట్టేసినవాడి పెళ్ళాం, ప్రార్థించిన దేముడే పుస్తె తెంపేసినట్లు గొల్లుమంటూంది.

కాలవ్వార మనిషి కేసు పిలిచేరు. ఆమే "వైరుని" క్రితం రాత్రి అసభ్యంగా మర్యాదకి భంగకరంగా బహిరంగ స్థలంలో బూతు పాటలు పాడుతూ ఆహ్వానించింది– అన్న "నేరం వప్పే సుకుంది. ఆమెకు రూ. 20–00 లు జరిమానా విధించేరు.

ఆమె రెండు వారాలై చీరలకీ లోలక్కులకీ అద్దె కట్టలేదు.

"ఈ రేత్తిరి సొకల్ది కోకిప్పుకుపోద్ది. కంసాలోడు సెవులువి తెంపుకుపోతాడు. మొన్న ఎల్లాల్సిన డాట్రుదగ్గిరికి ఎల్లడానికి రేపుకూడా రెండు రూపాయలుండవు" అనుకుంటూ ఆమె జరిమానా కట్టేసింది.

మళ్ళీ ఆ పాతిక రూపాయలు ఆర్జించడానికి ఎన్ని కురుపుల పురుగుల్ని కౌగలించుకోవాలో, ఎన్ని పాముల మచ్చలు ముదు పెట్టుకోవాలో అన్న ఆలోచన రాగానే ఆమె ఆకులా వణికి పోయింది.

❖ ❖ ❖

ఆకులా వణికిపోయింది–అదే టైముకి ఆనందరావు హృదయం.

అప్పుడు అతను మరకతాన్ని రైల్లో సాగనంపుతున్నాడు.

అతనిదగ్గర చెక్కు పుచ్చుకుంటూ అతని చెయ్యి ప్రేమతో నిమిరింది ఆమె.

**(1971)**

# థేంక్స్ ఫర్ ది పీ.యమ్

"రమ్ము, పాఠక మహాశయా! మనము ఆ యాగంతకుని వెంబ డింతము రమ్ము"

ఆ వరుస బంగళాలు సిమెంటు కేకుల్లా వున్నాయి. వాటి ముందు వయ్యారంగా వంగివున్న రోడ్డు, ఆ బంగళాలలో ఉండే వారి జోలికి దరిద్రం రాకుండా దేవుడు గీసిన గిరిలా ఉంది. దాని ముందున్న బీచ్ వెన్నెల కుప్పలా వుంది. సముద్రం మీద వెన్నెల వెండి ఆవిరిలా వుంది. ఆ వరుస బంగాళాల్లో వున్న 13 వ నెంబరు ఇంటి ఆవరణ ఆరెకరాలుంటుంది.

ఆ చలిరాత్రి దాన్లోని ఆకు కదలని చెట్లు ఆ వెన్నెల్లో రాతి చెట్లలా వున్నాయి.

ఆ ఇంటిగేటు పక్కనున్న గేరేజి కొత్త సబ్బు ముక్కలా ఉఁది. ఆ బంగాళా పోర్టికోలో ఆగివున్న మూడుకార్లు రెక్కలు ముడుచుకున్న ఇనుపపక్షుల్లా వున్నాయి.

ఆ దారులు పక్కనున్న ఎర్రకుండీలు పసి పాపల దోసిళ్ళలా వున్నాయి.

వాటిలోని మొక్కల పూల బరువుకి వంగి, తీరిన కోరికల్లా ఉన్నాయి.

ఈ ఇంటి ముందున్న మొజాక్ మెట్లు కరుడు గట్టిన పాలముక్కల్లా వున్నాయి.

పై మెట్టుమీదున్న డోర్‌మేట్ స్పాంజ్ కేక్‌లా వుంది.

ఆ వరండాలో వున్న గుండ్రబల్ల పెనుపువ్వు, బొడ్డులా వుంది. కాని చుట్టూ వున్న ఎర్ర ప్లాస్టిక్ కుర్చీలు ఆ పువ్వు రేకుల్లా వున్నాయి. దాని మీదున్న నల్లగాజు కుండా తెగ బలిసిన తుమ్మె దలా వుంది.

ఆ వరండా చివర నిద్రపోతున్న బంట్రోతు బానిసలా వున్నాడు.

వరండా వెనుక హాల్లో సీలింగ్ మధ్య చిన్న ఆకుపచ్చని ఎలెక్ట్రిక్ లైటు పులి కన్నులా ఉంది.

నేలని హాలంతా పరిచవున్న రెడ్‌కార్పెట్ రక్తపు మడుగులా ఉంది.

ఆ బంగళాముందు ఒక నల్లటి కారు చప్పుడు చేయకుండా వచ్చి ఆగింది. దాన్లోంచి ఒక ఎత్తైన యువకుడు దిగాడు. అతని